క్లుప్తంగా

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



పూజలందుకున్న లింగమేశ్వరస్వామి, కూర్మనారాయణస్వామి

ఆస్పరి: మండలంలోని శంకరబండ లింగమేశ్వరస్వామి, హలిగేర కొండల్లో వెలసిన కూర్మనారాయణస్వామి ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి గంగ, పంచామృతాభిషేకం, ఆకు పూజ, మంగళహారతి,నైవేద్యం సమర్పించారు. భక్తులు స్వామి వారినిదర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

2న హెబ్బటం ఉరుసు

హొళగుంద: మండల పరిధిలోని హెబ్బటం గ్రామంలో హజ్రత్ మహ్మద్ మల్తానిషా వలి ఉరుసు ఏప్రిల్ 2వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని ముజవర్లు మహబూబ్‌పీరా, సలాం, సలీం, ఉస్మాన్ తెలిపారు. ఏప్రిల్ 2న గంధం, 3న ఉరుసు, 4న జియారత్ కార్యక్రమాలతో ఉత్సవాలు ముగుస్తాయని పేర్కొన్నారు.

ఓటును అమ్ముకోవద్దు

మద్దికెర: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటును అమ్ముకోకుండా అభివృద్ధి చేసేవారిని ఎన్నుకోవాలని దక్షిణ భారతదేశ కాపు జేఏసీ కన్వీనర్ రాము అన్నారు. శనివారం స్థానిక కాపు, బలిజ రాయలసీమ కన్వీనర్ వైపీ వీరన్న స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బలిజలంతా ఒకే తాటిపై నడవాలన్నారు. రాష్ట్రంలో రెండు కులాలే రాజ్యాధికారం పొందుతున్నాయన్నారు. సుపరిపాలన అందాలంటే ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని కోరారు.

కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

కృష్ణగిరి: సార్వత్రిక ఎన్నికల వేళ గ్రామాల్లో ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయని మండల మోడల్ ప్రవర్తన నియమావళి అధికారి(ఎంసీసీ) రాబర్ట్ విల్సన్ హెచ్చరించారు. మండల పరిధిలోని పోతుగల్లు, ఆగవేలి గ్రామాల్లో శనివారం ఆయన పర్యటించారు. గ్రామాల్లో నిబంధనలకు విరుద్ధంగా ఏ కార్యక్రమం చేయరాదన్నారు. పార్టీ నాయకులు ప్రచారం చేయాలంటే ముందస్తు అనుమతి తీసుకోవాలని తెలిపారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎలాంటి ఆధారాలు లేకుండా రూ. 50 వేల కంటే ఎక్కువ మొత్తంలో నగదు తీసుకెళితే సీజ్ చేస్తామని చెప్పారు. ఈయన వెంట ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి రాజు నాయక్ ఉన్నారు.


సకాలంలో పన్నులు చెల్లించకుంటే నోటీసులు



మాట్లాడుతున్న పంచాయతీ సెక్రటరీ రాజశేఖర్

హొళగుంద: గ్రామ పంచాయతీకి సంబంధించి బకాయిలతో పాటు 2023–24 ఏడాదికి సంబంధించి ఇంటి పన్నులను సకాలంలో చెల్లించకుంటే నోటీసులు జారీ చేసి తదుపరి చర్యలు తీసుకుంటామని హొళగుంద మేజర్ పంచాయతీ సెక్రటరీ రాజశేఖర్ హెచ్చరించారు. రెండు రోజులుగా హొళగుందలోని పలు కాలనీలకు వెళ్లి పన్ను కట్టని వారికి హెచ్చరికలు జారీ చేశారు. ఇంటి, కొళాయి పన్నులు, లైసెన్స్ రిన్యూవల్, బంకు ఎంక్రోచ్‌మెంట్ తదితర పన్నులను సకాలంలో చెల్లించి పంచాయతీ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

ఇసుక ట్రాక్టర్లు సీజ్



సీజ్ చేసిన ట్రాక్టర్లు

దేవనకొండ: వెలమకూరు గ్రామంలోని వంక నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న నాలుగు ట్రాక్టర్లను శనివారం సీజ్ చేసినట్లు దేవనకొండ సీఐ శ్రీనివాసులుతెలిపారు. అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల్లో ఇసుక అక్రమ రవాణాపై పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు.

క్యాడర్‌లో జోష్

- ముఖ్యమంత్రి పర్యటనకు ప్రజల నుంచి విశేష స్పందన
- విజయవంతం చేసిన బుట్టా రేణుక
- వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో నూతనోత్సాహం

ఎమ్మిగనూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బస్సుయాత్రలో భాగంగా ఎమ్మిగనూరులో నిర్వహించిన 'మేమంతా సిద్ధం' బహిరంగ సభ గ్రాండ్ సక్సెస్ వైఎస్సార్‌సీపీ క్యాడర్‌లో జోష్ పెంచింది. నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుకకు ఇదే మొదటి సభ కావడం, బీసీ మహిళగా ముఖ్యమంత్రి సభను ఎలా నిర్వహిస్తారో అన్న విమర్శకుల నోళ్లు వెళ్లబెట్టేలా సభను విజయవంతం చేయడంతో బుట్టా రేణుకపై క్యాడర్‌లో విశ్వాసం అమాంతం పెరిగింది. లక్షకుపైగా హాజరైన ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లను పర్యవేక్షించడం, అనుకున్నదానికంటే ఎక్కువగా జనం తరలిరావడంతో బుట్టా రేణుకపై జిల్లా, రాష్ట్రస్థాయి నేతలు ప్రశంసలు కురిపిస్తున్నారు. సభ విజయవంతం కోసం ఆమె అన్న యుగంధర్, కుమారుడు బుట్టా ప్రతుల్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. శుక్రవారం ఎమ్మిగనూరు నియోజకవర్గం వేముగోడు నుంచి ప్రారంభమైన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన పుట్టపాశం, హెచ్ కైరవాడి, గాజులదిన్నెక్రాస్, గోనెగండ్ల, రాళ్లదొడ్డి, ఎర్రకోట మీదుగా ఎమ్మిగనూరుకు చేరుకుంది. ఎమ్మిగనూరులో కర్నూలు చౌరస్తా నుంచే ముఖ్యమంత్రి బస్సుయాత్రకు జనం పోటెత్తారు. ఎద్దుల మార్కెట్, శివసర్కిల్, ఎస్ఎంటీ కాలనీల మీదుగా వీవర్స్ కాలనీ గ్రౌండ్ వరకూ ప్రజలు, పార్టీ క్యాడర్‌కు అభివాదం చేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సభాప్రాంగణానికి చేరుకున్నారు. సుమారు 80వేల మంది సామర్థ్యం కలిగిన వీవర్స్ కాలనీ గ్రౌండ్ జనంతో కిక్కిరిసి పోయింది. సభాప్రాంగణం చాలక ఎక్కవ మంది ప్రజలు వీవర్స్ కాలనీ రోడ్లు, మిద్దెలపై నుంచే సీఎం సభను వీక్షించారు. సభలో వైఎస్సార్‌సీపీ ఎమ్మిగనూరు అభ్యర్థి బుట్టా రేణుక ప్రసంగం ప్రజలను ఆకట్టుకుంది. వైఎస్సార్‌సీపీ పాలనలో ఎమ్మిగనూరు నియోజకవర్గంలో సంక్షేమ కార్యక్రమాల ద్వారానే ప్రజలకు రూ.650 కోట్ల లబ్ధి చేకూరింది. బాబు హయాంలో పునాది రాళ్లకే పరిమితమైన ప్రభుత్వాస్పత్రి, నాగలదిన్నె ప్రాజెక్టు నిర్మాణాలను పూర్తి చేసిన ఘనత వైఎస్ జగన్‌కే దక్కిందని పేర్కొన్నప్పుడు సభలో హర్షధ్వానాలు మిన్నంటాయి. అదే విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఎమ్మిగనూరు అభ్యర్థి బుట్టా రేణుకను పరిచయం చేస్తూ 'సౌమ్యురాలు, మంచిచేసే మనస్సు ఉన్న నా చెల్లెలు బుట్టమ్మను మీరంతా ఆశీర్వదించండని''ఆప్యాయంగా పేర్కొనడంతో సభలో చప్పట్లు మార్మోగాయి. ముఖ్యమంత్రి తన ప్రసంగంలో పేదల పక్షాన పోరాడేందుకు నేను సిద్ధం.. మీరంతా సిద్ధమా అంటూ అడిగినప్పుడల్లా 'మేమంతా సిద్ధమే' అంటూ సభ దద్దరిల్లేలా ప్రజలు నినాదాలు చేశారు.



ఎమ్మిగనూరు రోడ్డు షోలో ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం వైఎస్ జగన్ (ఫైల్)

గోనెగండ్ల టీడీపీ ఖాళీ

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన సందర్భంగా గోనెగండ్ల మండలంలోని పలువురు టీడీపీ నేతలు వైఎస్సార్‌సీపీలో చేరారు. మాజీ ఎంపీపీ కృష్ణారెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు రాములమ్మలతో పాటు పలువురు మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీ సభ్యులు ముఖ్యమంత్రి సమక్షంలో పార్టీ కండువా కప్పుకున్నారు. అదే విధంగా అగ్రహారం,హెచ్ కైరవాడి సర్పంచ్‌లు బుట్టా రేణుక సమక్షంలో అప్పటికే పార్టీలో చేరారు. ప్రధాన టీడీపీ నేతలంతా వైఎస్సార్‌సీపీలో చేరడంతో గోనెగండ్లలో టీడీపీకి గట్టి షాక్ తగిలింది. నెల నుంచి పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్న వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ ఛైర్మన్ వై.రుద్రగౌడ్, సింగిల్ విండో ఛైర్మన్ వై.పురుషోత్తంగౌడ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని కలిసి పార్టీ అభ్యర్థి బుట్టా రేణుక గెలుపునకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నుంచి వారిపై సానుకూల స్పందన రావడంతో గౌడ్ వర్గీయులతోపాటు పార్టీ క్యాడర్‌లో మరింత జోష్ పెరిగింది. సభ విజయవంతానికి ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, ఆయన కుటుంబ సభ్యులు కూడా కృషి చేయడంతో పార్టీమొత్తం ఏకతాటిపై సార్వత్రిక సమరానికి సిద్ధమైంది.

కొత్త ఓటు నమోదుకు చివరి అవకాశం

దేవనకొండ: కొత్తగా ఓటు నమోదుకు ఎన్నికల కమిషన్ చివరి అవకాశం కల్పించిందని తహసీల్దార్ ఈశ్వరయ్యశెట్టి తెలిపారు. శనివారం తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో ఎవరైనా ఓటు నమోదు చేసుకోవాలనుకుంటే ఆధార్ కార్డు, పదో తరగతి మార్కుల జాబితా (చదువుకుని ఉంటేనే), పాస్‌పోర్ట్ ఫొటో, కుటుంబ సభ్యుల్లో ఎవరో ఒకరి ఓటు గుర్తింపు కార్డు, మొబైల్ నంబర్‌ను స్థానిక బీఎల్ఓకు అందజేయాలన్నారు. ఏప్రిల్ 15వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన వారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రైతులను ఆదుకోవాలని వినతి

మద్దికెర: మద్దికెరలో గడ్డివాములు దగ్ధమై నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు రవి, వెంకటేశులు, లక్ష్మీనారాయణ కోరారు. ఈ మేరకు శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ అధికారి రామదాసుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల వల్ల పంటలు సాగు చేయలేకపోయామని తెలిపారు. పశుగ్రాసం కూడా లేకపోవడంతో ఇతర ప్రాంతాలకు వెళ్లి కొనుగోలు చేశామన్నారు. గడ్డివాములు అగ్నికి ఆహుతి కావడంతో నష్టపోయామని వాపోయారు. తమను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకుంటామని రామదాసు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో శ్రీవారి పాన్పుసేవ

- ముగిసిన వార్షిక బ్రహ్మోత్సవాలు

మద్దికెర: పెరవలి గ్రామంలో శ్రీరంగనాథుడి వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం స్వామివారి పాన్పు సేవతో ముగిశాయి. చివరి రోజు ఉదయం స్వామి వారికి వివిధ రకాల అభిషేకాలు చేసి వివిధ పుష్పాలు, ఆభరణాలతో సుందరంగా అలంకరించారు. అష్టోత్తరనామార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని పల్లకీలో కొలువుంచి ఆలయ ద్వాదశ ప్రదక్షిణలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు రంగస్వామి ఆధ్వర్యంలో శ్రీరంగనాథుడి పాన్పు సేవ కనుల పండువగా జరిగింది. పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. మార్చి 21వ తేదీ నుంచి పది రోజుల పాటు నిర్వహించిన బ్రహ్మోత్సవాలు ముగిసినట్లు ఆలయ చైర్మన్ దస్తగిరిగౌడ్, ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.



శ్రీవారికి పాన్పుసేవ నిర్వహిస్తున్న అర్చకులు

కార్యకర్తల రుణం తీర్చుకుంటాం

ఆలూరు: సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మేమంతా సిద్ధం సభకు ఆలూరు నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేసిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు ఎమ్మెల్యే అభ్యర్థి బుసినే విరూపాక్షి, ఎంపీ అభ్యర్థి బీవై రామయ్య కృతజ్ఞతలు తెలిపారు. ఆలూరు, ఆస్పరి, చిప్పగిరి, హాలహర్వి, హొళగుంద, దేవనకొండ మండలాలకు చెందిన ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, సింగిల్ విండో అధ్యక్షులు, వ్యవసాయ సలహామండలి చైర్మన్లు, జేసీఎస్, మండల కన్వీనర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యుల చొరవ వల్ల సభ విజయవంతం అయ్యిందన్నారు. వారి రుణం తీర్చుకుంటామన్నారు. ఈ ఎన్నికల్లో టీడీపీ నాయకుల విధానాలను తిప్పికొట్టాలన్నారు. ప్రభుత్వం చేసిన మంచి పనులను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లి నియోజకవర్గంలో భారీ మెజారిటీ వచ్చేలా పనిచేయాలని కోరారు.



వైఎస్సార్‌సీపీ కార్యకర్తలతో ఎమ్మెల్యే అభ్యర్థి బుసినే విరూపాక్షి

టీబీ డ్యాంలో 4.8 టీఎంసీల నీరు

హొళగుంద: కర్ణాటకలోని తుంగభద్ర రిజర్వాయర్‌లో నీటిమట్టం అడుగంటుతోంది. టీబీ బోర్డు అధికారులు ఇప్పటికే పలు కాలువలకు నీటి సరఫరాను నిలిపి వేశారు. ఏప్రిల్ 11వ తేదీ నుంచి ఎల్లెల్సీకి కూడా నిలిపివేయనున్నారు. డ్యాంలోని నీటిని తాగునీటి అవసరాల కోసం వాడుకోనున్నారు. నీరు డెడ్ స్టోరేజీకి పడిపోతుండడంతో అధికారులు తాగునీటికి ప్రాధాన్యత ఇస్తున్నారు. వర్షాకాలంలో డ్యాంలో నీరు చేరితే జూలైలో మళ్లీ విడుదల చేస్తారు. జిల్లా పశ్చిమ ప్రాంత ప్రజలకు తాగు, సాగు నీరునందించే తుంగభద్ర కాలువ నాలుగేళ్లుగా రెండు కార్లకు సాగునీరు అందించింది. వర్షాభావ కారణంగా ఈ ఏడాది ఖరీఫ్‌కు మాత్రమే సాగు విడుదల చేశారు.

రిజర్వాయర్‌లో నీటి నిల్వలు

టీబీ డ్యాం పూర్తి సామర్థ్యం 1633 కాగా శనివారం నాటికి 1580.85 అడుగులకు చేరుకుంది. మొత్తం 105.788 టీఎంసీలకు గాను కేవలం 4.8 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఇన్‌ఫ్లో నిల్ ఉండగా, అవుట్‌ఫ్లో రూపంలో ఎల్లెల్సీకి 730, జిందాల్‌కు 10, రాయబసవన కాలువకు 120 క్యూసెక్కులు కలిపి మొత్తం 860 క్యూసెక్కుల నీరు డ్యాం నుంచి బయటకు వెళుతోంది. గత ఏడాది ఇదే సమయానికి 8.588 టీఎంసీల వరకు నీరు ఉంది. ఇక ఎల్లెల్సీకి సంబంధించి ఆంధ్రా కాలువ ప్రారంభం 250 కి.మీ వద్ద 480 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతోంది.



టీబీ డ్యాం

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

కర్నూలు : కర్నూలు బళ్లారి చౌరస్తా ఫ్లై ఓ వర్ బ్రిడ్జిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో కల్లూరులోని రామకృష్ణనగర్‌కు చెందిన మణికుమార్ (29) మృతిచెందాడు. స్నేహితుడు శివతో కలిసి శుక్రవారం అర్ధరాత్రి బుల్లెట్‌పై ఫ్లై ఓవర్ బ్రిడ్జి మీదుగా ఇంటికి వెళ్తుండగా మినీ లారీ అసోసియేషన్ కార్యాలయం ఎదురుగా బ్రేక్ డౌన్ అయి ఆగివున్న లారీని ఢీకొట్టారు. మణికుమార్ తలకు బలమైన గాయాలయ్యాయి. వెనుక కూర్చున్న శివకు కూడా రక్తగాయాలయ్యాయి. 108లో ఇరువురిని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. డ్యూటీ డాక్టర్ పరిశీలించి మణికుమార్ మృతిచెందినట్లు నిర్ధారించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ట్రాఫిక్ సీఐ గౌతమి తెలిపారు.

సభ విజయవంతం చేసినందుకు ధన్యవాదాలు

దేవనకొండ: ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈనెల 29వ తేదీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎమ్మిగనూరులో నిర్వహించిన 'మేమంతా సిద్ధం' సభను విజయవంతం చేసిన ప్రతి కార్యకర్తకు వైఎస్సార్‌సీపీ మండల ఎన్నికల అబ్జర్వర్ సురేందర్‌రెడ్డి, జేసీఎస్ కో–ఆర్డినేటర్ రాజారెడ్డి, మండల కన్వీనర్ తపాల శ్రీనివాసులు ధన్యవాదాలు తెలిపారు. శనివారం స్థానిక ఫంక్షన్ హాలులో మాట్లాడుతూ.. మండలం నుంచి సుమారు 5 వేల మంది 45 బస్సులు, సొంత వాహనాల్లో సభకు వెళ్లినట్లు తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌పై ఉన్న అభిమానంతో ఎండను సైతం లెక్కచేయకుండా గంటల తరబడి ఎదురుచూసి సీఎం ప్రసంగాన్ని వీక్షించారని తెలిపారు. అందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వేయించి భారీ మెజారీతో గెలిపించాలని కోరారు. నాయకులు లుముంబా, యూసఫ్, కబీర్‌దాసు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పార్టీ నాయకులు సురేందర్‌రెడ్డి, రాజారెడ్డి

గురువులను గౌరవించాలి

ఆస్పరి: దైవ సమానులైన గురువులను శిష్యులు గౌరవించి వారి బోధనలను పాటించాలని అనంతపురం జిల్లా శాంతానంద ఆశ్రమం పీఠాధిపతి శ్రీగురు సేవానందస్వామిజీ అన్నారు. శనివారం ఆస్పరి మండలం ముత్తుకూరు గ్రామంలో శ్రీశివరామ దయానంద స్వామి నవమ ఆరాధన మహోత్సవాలు శ్రీరామ సేవ కుటీరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గురుసేవానందస్వామిజీ మాట్లాడుతూ.. సమాజంలో మార్పు రావాలంటే గురువ పాత్ర కీలకమన్నారు. సద్గురు రాఘవేంద్రస్వామి, వీరబ్రహ్మేంద్రస్వామి, రామకృష్ణ పరమహంస బోధనలు సమాజానికి ఆదర్శంగా నిలిచాయని తెలిపారు. నిస్తేజంగా ఉన్న వ్యక్తిలో తేజస్సును నింపి వెలుగు పథంలో నిలబెట్టే వారే నిజమైన గురువన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లాశాఖ కార్యనిర్వాహకుడు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి, జొహరాపురం అద్వైతానంద ఆశ్రమ పీఠాధిపతి శ్రీనివాసాచార్యులు స్వామి, శ్రీరామసేవ సంఘం అధ్యక్షుడు లక్ష్మీరెడ్డి, ఉపాధ్యక్షుడు హనుమంతు పాల్గొన్నారు.



ముత్తుకూరులో మాట్లాడుతున్న శ్రీగురు సేవానంద స్వామిజీ

జనాభిమానం

పత్తికొండ రూరల్: తమ అభిమాన నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాక కోసం పత్తికొండ వాసులు ఎంతో ఆతృతగా ఎదురుచూశారు. శుక్రవారం రాత్రి వయా ఆస్పరి మీదుగా అటికెలగుండు, దేవనబండ, చిన్నహుల్తి గ్రామాల మీదుగా పత్తికొండకు చేరుకున్న జగన్ పత్తికొండ–రాతన రోడ్డులోని శిబిరంలోనే రాత్రి బస చేశారు. తమ అభిమాన నేతను చూడాలని శనివారం ఉదయాన్నే ప్రజలు తండోపతండాలుగా శిబిరం వద్దకు చేరుకున్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు కూడా బస్సు యాత్ర ప్రారంభమయ్యేంత వరకు మండుటెండను లెక్కచేయకుండా అక్కడే వేచి ఉన్నారు. జగనన్న ఆప్యాయంగా పలకరిస్తూ, ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు.



పత్తికొండ-రాతన రోడ్డులోని శిబిరం వద్ద జననేత కోసం వేచి ఉన్న ప్రజలు

శిలాఫలకాలపైనే హామీలు పదిలం బాబూ..!

- ప్రజాగళం పేరుతో చంద్రబాబు పర్యటనలు
- నేడు ఎమ్మిగనూరులో రోడ్డు'షో'

ఎమ్మిగనూరు: రైతులకు.. డ్వాక్రా అక్కచెల్లెమ్మలకు రుణాలు మాఫీ అంటూ.. ఇంటికో ఉద్యోగం కుదరకపోతే ఐదేళ్లపాటు నిరుద్యోగ భృతి అంటూ 650 హామీలతో రాష్ట్ర ప్రజలను వంచించి 2014లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఎన్నికలయ్యాక అందరినీ నిలువునా ముంచారు. 2019 ఎన్నికల్లో ఆయన నిజస్వరూపం తెలుసుకుని గుణం పాఠం చెప్పారు. మళ్లీ ప్రజలను మభ్యపెట్టే పనిలో పడ్డారు''. ప్రజాగళం పేరుతో చంద్రబాబునాయుడు ఆదివారం ఎమ్మిగనూరులో రోడ్డు'షో'చేసి తేరుబజారులో ప్రసంగించనున్నారు.

☛'ఎమ్మిగనూరులో చేనేతల కోసం అహర్నిశలు పనిచేస్తున్నా.. టెక్స్‌టైల్‌పార్కు నిర్మాణం కోసం చాలా కంపెనీలు ఐటీ మంత్రి నారా లోకేష్‌తో చర్చించారు. చాలా కంపెనీలు ముందుకు వస్తున్నాయి అంటూ అప్పటి ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి ప్రతి చేనేత సమావేశాల్లో ఊదరగొట్టిన మాటలు.. అధికారంలో ఉన్న ఐదేళ్లు అబద్దాలతో కాలయాపన..టెక్స్‌టైల్ పార్కునిర్మాణం జరిగిందిలేదూ..ఒక్క కంపెనీతో ఎంఓయు కుదుర్చుకొనిందీలేదూ.

చేనేతల చెవిలో పువ్వు

చేనేత రంగానికి ఎమ్మిగనూరులో అప్పెరియల్ పార్క్‌ను నిర్మించి వారి కష్టాలు తీరుస్తామని, ఉద్యోగాలు కల్పిస్తామని టీడీపీ నేతలు గతంలో ఎన్నికల వాగ్దానాలు చేశారు. అందుకు అనుగుణంగానే 2004 ఫిబ్రవరి 15న అప్పటి చేనేత మంత్రి పడాల భూమన్న, మున్సిపల్ మంత్రి బీవీ మోహన్‌రెడ్డి అప్పెరల్ పార్క్ ఏర్పాటుకు బనవాసి వద్ద శంకుస్థాపన చేశారు. అటు తరువాత అది మరుగున పడింది. ఆ తర్వాత సార్వత్రిక ఎన్నికలకు ముందు పాదయాత్రగా వచ్చిన చంద్రబాబునాయుడు అప్పెరియల్ పార్కు నిర్మిస్తామని మరోమారు ఎన్నికల హామీ గుప్పించారు. ఎన్నికలయ్యాక 2016 మే1న నవోదయ స్కూల్ ముందు మరోమారు శిలాఫలకం వేశారు. శిలాఫలకం తప్పా అంగుళం కూడా ముందుకు కదలలేదు.

ప్రాజెక్టుల పేరుతో రైతులకు టోకరా

జిల్లాలోని పశ్చిమప్రాంత రైతులు ప్రయోజనమంటూ 1999 జూన్ 23న అప్పటి ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబునాయుడు రూ. 136.35 కోట్లతో ప్రాజెక్ట్ నిర్మాణానికి పరిపాలన అనుమతినిచ్చి అదే రోజు ఎమ్మిగనూరులో శంకుస్థాపన చేశారు. గురురాఘవేంద్ర ప్రాజెక్ట్‌గా నామకరణం చేశారు. ఆ తరువాత నిధులు ఇవ్వడం మరిచారు. 2004లో ముఖ్యమంత్రిగా వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జలయజ్ఞంలో భాగంగా గురురాఘవేంద్ర ప్రాజెక్టుకు రూ. 180కోట్లు కేటాయించారు. ప్రాజెక్టు పూర్తిచేసి రైతులకు సాగునీరందించారు. గురురాఘవేంద్ర ప్రాజెక్టులో భాగంగా రూ. 263.09 కోట్లతో అదనంగా పులికనుమ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టారు. 26,400 ఎకరాలకు సాగునీరు అందించే ఈ ప్రాజెక్టును 2008 సెప్టెంబర్ 21న వైఎస్సార్ శంకుస్థాపన చేశారు. 80శాతం పనులు కూడా పూర్తయ్యాయి. అనంతరం అధికారంలోకి వచ్చిన బాబు తానే ప్రాజెక్టు పూర్తిచేశానంటూ ప్రారంభోత్సవం చేసి మమ అనిపించారు. 2019 ఎన్నికలకు ముందూ ఆర్డీఎస్ కుడికాలువ, వేదావతి, గుండ్రేవుల ప్రాజెక్టు అంటూ బాబు బ్యాచ్ చేసిన హడావుడి అంతా ఇంతకాదు. ఆ ప్రాజెక్టులు ఇంకా ఎందుకు పూర్తి కాలేదంటూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై దుష్ప్రచారానికి రంకెలు వేయడం బాబుకే సాధ్యమంటూ రైతన్నలు మండిపడుతున్నారు.



బాబు పాలనలో అప్పెరల్ పార్కు కోసం వేసిన శిలాఫలం



రైతులకు నీళ్లిచ్చానంటూ గొప్పలు చెప్పే గురురాఘవేంద్ర ప్రాజెక్టు పునాదిరాయి



హొళగుంద ఎల్లెల్సీ కాలువలో ఈత కొడుతున్న యువకులు, పిల్లలు

ఉల్లాసంగా.. ఉత్సాహంగా

హొళగుంద/చిప్పగిరి: సూర్యుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. ఎండ తీవ్రతకు బయటకు వెళ్లాలంటేనే జనం బెంబేలెత్తుతున్నారు. వేసవి తాపాన్ని తీర్చుకోవడానికి కొందరు శీతల పానీయాలను తీసుకుని ఉపశమనం పొందుతున్నారు. మరికొందరు బావులు, కాలువలకు చేరుకుని వెసవి తాపాన్ని తీర్చుకుంటున్నారు. హొళగుందతో పాటు తుంగభద్ర దిగువ కాలువ (ఎల్లెల్సీ) పరిసర గ్రామాల్లో యువకులు ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈత కొడుతూ ఆనందంగా గడుపుతున్నారు. చిన్న పెద్దా తేడా లేకుండా గంటల తరబడి కాలువలో గడుపుతున్నారు. హొళగుంద దిగువ కాలువ వద్ద నిత్యం పెద్ద సంఖ్యలో యువకులు, పిల్లలు సందడి చేస్తున్నారు. కాగా టీబీ బోర్డు అధికారులు ఎల్లెల్సీకి ఏప్రిల్ 11న నీటి సరఫరాను నిలిపి వేయనున్నారు. మరో రెండు వారాల్లో కాలువకు నీరు ఆగిపోనుండడంతో పెద్ద సంఖ్యలో ప్రజలు ఇక్కడికి వస్తున్నారు. అలాగే చిప్పగిరిలోని నీటి కుంటలో చిన్నారులు జలకాలాడుతూ సందడి చేస్తున్నారు.



చిప్పగిరిలో జలకాలాడుతున్న చిన్నారులు

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వృద్ధుడి మృతి



బోయ వెంకట్రాముడు(ఫైల్)

ఎమ్మిగనూరురూరల్: ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన దైవందిన్నె గ్రామానికి చెందిన బోయ వెంకట్రాముడు(60) కర్నూల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. రూరల్ ఎస్ఐ శరత్‌కుమార్‌రెడ్డి వివరాల మేరకు.. బోయ వెంకట్రాముడికి ఇద్దరు భార్యలు లక్ష్మీదేవి, లక్ష్మీ, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఇద్దరు భార్యలు కొన్నేళ్ల క్రితం మృతి చెందారు. చిన్న కుమారుడు లక్ష్మీనారాయణ దగ్గర ఉంటున్నాడు. తనకు ఉన్న ఎకరన్నర పొలం, మరో 2 ఎకరాలు కౌలుకు తీసుకుని మిరప పంటను సాగు చేశాడు. పంట పెట్టుబడికి సుమారు రూ. 3 లక్షల వరకు అప్పు చేశారు. పంట వచ్చినా ధర లేకపోవడం, అప్పులు ఇచ్చిన వారి నుంచి ఒత్తిడి పెరగడంతో మూడు రోజుల కిత్రం గ్రామ సమీపంలోని వంకలోకి వెళ్లి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం కర్నూల్‌కు తరలించారు. కర్నూల్‌లోని ఓ ప్రైవేట్ హస్పిటల్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుమారుడు లక్ష్మీనారాయణ ఫిర్యాదు మేరకు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వెల్లడించారు.